## 'డి' ఫారం పట్టాలకు ప్రొటెక్షన్ ఇవ్వడం దుర్మార్గం

**జీలుగుమిల్లి:** ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న డి నమూనా పట్టాలకు ప్రొటెక్షన్ ఇవ్వడం దుర్మార్గమని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు విమర్శించారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరుల డి నమూనా పట్టాలకు ప్రొటెక్షన్ ఇవ్వకూడదని హై కోర్టు ఉత్తర్వులున్నాయని వాటిని పరిగణనలోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జీలుగుమిల్లి రెవెన్యూ పరిధిలోని బర్రింకలపాడులో 'డి' నమూనా పట్టాలతో కొందరు గిరిజనేతరులు స్థానిక తహశీల్దార్ నుంచి ప్రొటెక్షన్ ఆర్డర్ తీసుకువచ్చి పోలీసులను ఏర్పాటు చేసిమరీ పొలాలను దున్నించడం దుర్మార్గమని ఆయన దయ్యబట్టారు. ఈ ఘటనపై సిపిఎం తరపున ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామని తెలిపారు. రెవెన్యూ అధికారులు హై కోర్టు ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకుని ఇచ్చిన ఆర్డర్లను తక్షణం ఆపాలని హెచ్చరించారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెల్లం సంకురుడు, అప్పారావు, కొర్సా దుర్గ, జయమ్మ పాల్గొన్నారు.

# అటకెక్కిన రెగ్యులేటర్లు..!

**కొల్లేరులో రెగ్యులేటర్ల నిర్మాణాన్ని పట్టించుకోని పాలకులు**
**ఉప్పునీరు చేరి దెబ్బతింటున్న భూములు**
**సిఎంనే స్వయంగా ప్రకటించినా అతీగతీలేని దుస్థితి**
**ఎన్నికల ముందు శంకుస్థాపనల జాబితాలోకేనా ఇది**
**కొల్లేరు పర్యాటక అభివృద్ధి సైతం కాగితాల్లోనే**

కొల్లేరు సరస్సు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరు ప్రజల గురించి పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. ఎన్నికల తరుణంలో కొల్లేరు ప్రజలకు హామీలు గుప్పించడం.. గెలిచిన తర్వాత మౌనం వహించడం రాజకీయ పార్టీలకు పరిపాటిగా మారిపోయింది. 2014 ఎన్నికల్లో తాము అధికారంలోకొస్తే కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని టిడిపి హామీ ఇచ్చింది. అసెంబ్లీలో తీర్మానం చేసి మమ అన్పించడం తప్ప జరిగిందేమీ లేదు. కొల్లేరులో పర్యాటక అభివృద్ధి సైతం వాగ్దానాలకే పరిమితమైంది. 2019 ఎన్నికలు, ఆ తర్వాత వైసిపి సైతం కొల్లేరు ప్రజలకు పలు హామీలు గుప్పించింది. కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేసి అక్కడి ప్రజలకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చింది. కొల్లేరులో రెగ్యులేటర్ల నిర్మాణానికి సంబంధించి ఒక్క నెలలోనే శంకుస్థాపన చేయనున్నట్లు 2022 మే 16న గణపవరంలో జరిగిన బహిరంగ సభలో సిఎం జగన్ ప్రకటించారు. ఎన్నికలు జరిగి నాలుగేళ్లయింది. కొల్లేరులో పర్యాటక అభివృద్ధి అనేది కాగితాలకే పరిమితమైంది. ఇక రెగ్యులేటర్ల నిర్మాణానికి వస్తే సిఎం ప్రకటించిన ఏడాదిన్నర కావొస్తున్నా ఒక్క అడుగూ ముందుకు పడని దుస్థితి నెలకొంది. దీంతో కొల్లేరు అభయారణ్యం ఉప్పకయ్యలుగా మారుతున్న దుస్థితి ఏర్పడింది. కొల్లేరులోకి సముద్రం నుంచి ఉప్పునీరు చేరి భూములన్నీ దెబ్బతింటున్నాయని, ఉప్పునీరు రాకుండా రెగ్యులేటర్లు నిర్మించాలని ఎప్పటి నుంచో జనం కోరుతున్నారు. దీంతో ఆకివీడు మండలం దుంపగడప, మొగల్తూరు మండలం పడితడక వద్ద రెగ్యులేటర్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. రెగ్యులేటర్ల నిర్మాణానికి రూ.412 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ప్రభుత్వం నిధులకు సంబంధించిన ఉత్తర్వులు సైతం జారీ చేసినట్లు ప్రకటించారు. అయినా ఇప్పటి వరకూ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. అసలు రెగ్యులేటర్ల నిర్మాణం జరుగుతుందా అనే చర్చ కొల్లేరు ప్రజల్లో నెలకొంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు ప్రభుత్వం ఇచ్చిన ప్రధాన హామీల్లో తాగునీటికి సంబంధించి వాటర్ గ్రిడ్ నిర్మాణం, కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం ప్రధానమైనవి. వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగేళ్లు దాటిపోయింది. మరో ఏడెనిమిది నెలల్లో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటి వరకూ జిల్లాకు ఇచ్చిన ఏఒక్క హామీ నెరవేరలేదు. వాటర్‌గ్రిడ్ పూర్తికాకపోవడంతో ఇప్పటికీ జనం కలుషిత నీటినే తాగుతూ రోగాలబారిన పడుతున్నారు. రెగ్యులేటర్ల నిర్మాణం జరగకపోవడంతో కొల్లేరులో ఉప్పునీరు చేరి పర్యావరణం పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది.

**పడకేసిన పర్యాటక అభివృద్ధి**

కొల్లేరు అభయారణ్యం 77 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. ప్రతియేటా వందల సంఖ్యలో విదేశీ పక్షులు ఇక్కడకు వలస వస్తుంటాయి. కొల్లేరులో బోటు షికారు, రిసార్ట్స్ వంటివి ఏర్పాటు చేస్తే పర్యాటకంగా ఎంతగానో అభివృద్ధి చెందుతోంది. కొల్లేరు ప్రజలతోపాటు ఎంతోమందికి ఉపాధి దొరుకుతోంది. దీనిపై అనేకసార్లు అధికారులు సమీక్షలు చేయడం తప్ప పనులు మాత్రం సాగలేదు. ఆటపాక వద్ద ఉన్న పక్షుల కేంద్రాన్ని సైతం అభివృద్ధి చేయకుండా గాలికొదిలేసిన పరిస్థితి ఉంది. దీంతో ప్రభుత్వ తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీ నాయకుల అండతో బడాబాబులు మళ్లీ చేపల చెరువులు తవ్వుతూ కొల్లేరును పూర్తిగా కలుషితం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రెగ్యులేటర్ల నిర్మాణంతోపాటు కొల్లేరు పర్యాటక అభివృద్ధిపై దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు.

## జిల్లాలోకి ప్రవేశించిన లోకేష్ పాదయాత్ర

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర జిల్లాలోకి ప్రవేశించింది. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం నుంచి నూజివీడు నియోజకవర్గంలోని మీర్జాపురం గ్రామానికి గురువారం రాత్రి యాత్ర చేరుకుంది. లోకేష్‌కు ఎఎంసి మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు గజమాల, పూల బొకేలతో ఘన స్వాగతం పలికారు. యువ గళం పాదయాత్రలో మాజీ ఎంఎల్ఎలు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, చింతమనేని ప్రభాకర్, టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, నేతలు మాగంటి బాబు, ప్రత్తిపాటి పుల్లారావు, కాపా శ్రీనివాసరావు, మహిళా నేతలు నజీమా, గొల్లు దుర్గాదేవి పాల్గొన్నారు.

మీర్జాపురంలో యువగళం పాదయాత్రలో నారా లోకేష్, టిడిపి నేతలు

లబ్ధిదారులకు డెమో చెక్కును అందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

## నవరత్నాల ద్వైవార్షిక నగదు విడుదల

**జిల్లాలో 5024 మందికి రూ.5.86 కోట్లు జమ - కలెక్టర్ ప్రసన్న వెంకటేష్**

ప్రజాశక్తి - ఏలూరు

నవరత్నాల ద్వైవార్షిక నగదు మంజూరుకు అర్హులై ఉండి ఏ కారణంచేతనైనా లబ్ధిఅందని 5024 మంది ఖాతాలకు రూ.5.86 కోట్లు జమ చేశామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నవరత్నాలు-ద్వైవార్షిక నగదు 2,62,169 మంది అర్హులకు రూ.216.34 కోట్లను బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాలో సిఎం జగన్ జమచేశారు. కలెక్టరేట్ నుంచి ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, సాంఘీక సంక్షేమశాఖ జెడి.జయప్రకాష్, బిసి కార్పొరేషన్ ఇడి ఎన్.పుష్పలత, జిఎస్ డబ్ల్యుఎస్ నోడల్ అధికారి రమణ, పలువురు విద్యార్థులు, లబ్దిదారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం మెగా నమూనా చెక్కును కలెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల మంజూరులో అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా లబ్ధిఅందని లబ్ధిదారులను ప్రతీఏడాది జూన్, డిసెంబరు నెలలను ప్రాతిపదికగా గుర్తించి వారికి మరో అవకాశం ఇస్తున్నారన్నారు. ఈ విధంగా జిల్లాలో 5024 మందిని గుర్తించి రూ.ఐదు కోట్ల 86 లక్షల 17 వేల 301 ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. చేదోడు కింద రూ.10 వేలు చొప్పున 1771 మందికి రూ. 1.77 కోట్లు, జగనన్న వసతి దీవెన రూ.10 వేలు చొప్పున 1099 మందికి రూ.1.03 కోట్లు, విద్యాదీవెన 985 మందికి రూ.1.42 కోట్లు, అమ్మఒడి రూ.15 వేలు చొప్పున 702 మందికి రూ.1.05 కోట్లు, ఇబిసి నేస్తం రూ.15 వేలు చొప్పున 306 మందికి రూ.45.90 లక్షలు, రైతు భరోసా 156 మందికి రూ.11.42 లక్షలు, వైఎస్ఆర్ నేతన్న నేస్తం రూ.24 వేలు చొప్పున నలుగురికి రూ.96 వేలు, మత్స్యకార భరోసా ఒకరికి రూ.10 వేలు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు.

విద్యార్థికి రక్తహీనత నివారణ మాత్రను వేస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

## విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతిస్తున్నామని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. సత్రంపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి, పాఠశాల తరగతులు, విద్యాబోధన, పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ, వైద్య సిబ్బంది విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ విద్యద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమని నమ్మిన సిఎం జగన్ విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతిస్తున్నారని, ఏటా విద్యారంగానికి రూ.వేలాది కోట్లు కేటాయిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాడు-నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించిందన్నారు. ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ తరగతి గదుల ఏర్పాటు, గుణాత్మక విద్యపై ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ అందించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల స్థాయిని మరింత పెంచామన్నారు. ప్రభుత్వం చేపట్టిన పనులతో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగాయన్నారు. అమ్మఒడి ద్వారా విద్యార్థుల తల్లులకు ఆర్థికసాయం, జగనన్న విద్యా కానుక ద్వారా పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారాలు, బూట్లు ఉచితంగా అందిస్తున్నారని, జగనన్న గోరుముద్ద ద్వారా విద్యార్థులకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే విద్యార్థులకు వైద్య సిబ్బందిచే ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, రక్తహీనత, దృష్టిలోపం వంటి సమస్యలకు వెంటనే చికిత్స చేసి, మందులు అందిస్తున్నారన్నారు. విద్యార్థులకు రక్తహీనత నివారణ మాత్రలను జెడ్‌పి ఛైర్‌పర్సన్ స్వయంగా వేశారు. అనంతరం పాఠశాలల్లోని టాయిలెట్ల నిర్వహణ ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శైలజ, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ విజేష్, వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు గంటా ప్రసాదరావు పాల్గొన్నారు.

## ఉద్యోగాల కల్పనకు కృషి అభినందనీయం

**జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ**

ప్రజాశక్తి - ఏలూరు

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు కృషిచేయడం అభినందనీయమని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. స్థానిక నరసింహారావు పేటలోని ఎస్ఎజి అకాడమీ నిర్వహించిన జాబ్‌మేళాలో పాల్గొని అభ్యర్థులకు పలు కార్పొరేట్ కంపెనీలు కల్పించిన ఉద్యోగావకాశాలకు సంబంధించిన ఆఫర్ లెటర్లను ఆమె అందించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందించి యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతిస్తుందన్నారు. ఎస్ఎజి అకాడమీ వంటి సంస్థలు జాబ్‌మేళాలు ఏర్పాటుచేసి, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. అకాడమీ కార్యదర్శి కాట్రు బాలు మాట్లాడుతూ జాబ్ మేళాకు మంచి స్పందన వచ్చిందని, 556 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 250 మందికి జాబ్ ఆఫర్ లేఖలు అందించారన్నారు. మరో 50 మందికి దిగ్గజ కార్పొరేట్ సంస్థల్లో మొదటి విడతలో ఎంపికయ్యారని, వారికి మరో రెండు విడతల్లో ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. జాబ్ మేళాకు టెక్ మహీంద్రా, కాప్ జెమిని,హెటిరో, అరబిందో, జెంటాక్, హెచ్‌డిఎఫ్‌సి, టెక్ విష్ వంటి సంస్థలు పాల్గొని అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు, వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు గంటా ప్రసాదరావు పాల్గొన్నారు.

ఉద్యోగ ఆఫర్ లెటర్‌ను అందిస్తున్న పద్మశ్రీ

ఇస్రో ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

## చంద్రయాన్-3 విజయవంతంపై హర్షం

**ద్వారాకతిరుమల:** మండలంలోని పంగిడిగూడెం హైస్కూల్లో చంద్రయాన్-3 విక్రమ్‌ల్యాండర్ విజయవంతమైన సందర్భంగా విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఇస్రో ఆకృతిలో కూర్చుని తమ అభిమానం చాటారు.

సమావేశంలో మాట్లాడుతున్న సూర్యకిరణ్

## ఉద్యోగ కల్పనలో ప్రభుత్వాలు విఫలం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నిరుద్యోగులకు ఇచ్చిన ఉద్యోగ హామీలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ విమర్శించారు. గురువారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో డివైఎఫ్ఐ జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం జిల్లా కమిటీ సభ్యులు బి.కిషోర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న నిరుద్యోగుల సమస్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు సిగ్గుచేటని విమర్శించారు. 'నిరుద్యోగం - పరిష్కార మార్గాలు' అంశంపై ఈనెల 25న విజయవాడలో జరుగుతున్న జాతీయ సదస్సును జయప్రదం చేయాలని నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న నరేంద్ర మోడీ ఇప్పటివరకూ ఎన్ని ఉద్యోగాలిచ్చారని ప్రశ్నించారు. హామీలతో దేశ ప్రజలను మోసగించడమే కాకుండా దేశ సంపద, ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ గద్దలైన అంబానీ, అదానీలకు దోచిపెడుతూ భావితరాల భవిష్యత్తును కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ప్రతీసంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తానన్న సిఎం జగన్ ఇప్పటి వరకూ నిరుద్యోగ సమస్యలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం తమ హామీలను నెరవేర్చుకోవాలని లేనిపక్షంలో రానున్న ఎన్నికలలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి యువజన సంఘాలు, ప్రజాసంఘాల మద్దతుతో పోరాటాలు నిర్వహించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ వైఖరిని తిప్పికొడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ప్రకాష్, ఏసు, రాజేష్, కార్యకర్తలు నాగు, నాగేంద్ర, ప్రవీణ్ పాల్గొన్నారు.

## నేడు గుండుగొలను సబ్‌స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలనులో రూ.3.50 కోట్ల వ్యయంతో నిర్మించిన 5ఎంవి సామర్థ్యం గల విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు ఈనెల 25వ తేదీన ప్రారంభోత్సవం చేయనున్నారని వైసిపి గ్రామ అధ్యక్షులు, ఉపసర్పంచి ముదుండి సూర్యనారాయణరాజు తెలిపారు. దీర్ఘకాలంగా గుండుగొలను, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు విద్యుత్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ దశలో ఈ సమస్యను ఉపసర్పంచి శాసనసభ్యుని దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన సబ్‌స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. దీని నిర్మాణంతో గుండుగొలను, వడ్డిగూడెం, కోరుకొల్లు, రత్నాపురం, లక్ష్మీపురం, లింగంపాడు గ్రామాలతో పాటు భీమడోలు దిగుడుపాటిదిబ్బ, గుండుగొలనులో ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన జగనన్న కాలనీలకు విద్యుత్ ఇబ్బందులు తొలగిపోనున్నాయి. దీంతోపాటు కొల్లేరుప్రాంతంలో ఆక్వా రంగానికి విద్యుత్ సమస్యలు తీరనున్నాయి. దీనిపై భీమడోలు ఎఇ రామస్వామి మాట్లాడుతూ సబ్‌స్టేషన్‌కు అధునాతన సౌకర్యాల కల్పనకు ఉన్నతాధికారులు అనుమతించారన్నారు. గతంలో సూరప్పగూడెం సబ్‌స్టేషన్ నుంచి గుండుగొలను, పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా జరిగేదన్నారు. ఒక్కొక్క సమయంలో గుండుగొలను దిగువన గల ఆగడాలలంక సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా వచ్చేదన్నారు. ఫలితంగా ఆ ప్రాంతమంతా విద్యుత్ లో వోల్టేజీ, నాసిరకం విద్యుత్ సరఫరా ఇతర సమస్యలు ఏర్పడేవన్నారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తి చేసుకున్న గుండుగొలను సబ్‌స్టేషన్‌కు విద్యుత్ నేరుగా రావడం వల్ల ఆ సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. వీటికి అదనంగా 33 కెవి, 11 కెవి విద్యుత్ లైన్లకు ఎబి స్విచ్‌లను ఏర్పాటు చేయడం వల్ల అంతరాయం ఏర్పడిన విద్యుత్ లైన్లు గల ప్రాంతంలోనే మరమ్మతులు చేపట్టే ఇతర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేసే అవకాశం లభించిందన్నారు.

## నేటి నుంచి ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఎస్ఐ ఉద్యోగాలకు సంబంధించి ప్రాథమిక పరీక్ష ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ఈ నెల 25 నుంచి ఏలూరు రేంజ్ పరిధిలో స్థానిక పోలీస్ గ్రౌండ్‌లో ప్రారంభంకానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ శాఖలో ఎస్ఐ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తొలిదశ ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రెండో దశ దేహదారుఢ్య పరీక్షలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేశారు. 25వ తేదీ తెల్లవారుజాము నుంచి ఎంపిక పరీక్షలు ప్రారంభించేందుకు పోలీస్ ఉన్నతాధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అభ్యర్థులకు పిజికల్ మేనేజ్మెంట్ పరీక్ష (పిఎంటి), ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ (పిఇటి) నిర్వహించనున్నారు. ఏలూరు రేంజ్ పరిధిలో 9689 మంది అభ్యర్థులకు దశలవారీగా పరీక్షలు నిర్వహించి, ఎంపిక చేస్తారు.

8247 మంది పురుష అభ్యర్థులు, 1142 మహిళా అభ్యర్థులు తమ సత్తాచాటనున్నారు. ఈ పరీక్షలు వచ్చేనెల తొమ్మిదో తేదీ వరకూ నిర్వహించేలా చర్యలు చేపట్టారు. తొలుత సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసి అనంతరం ఫిజికల్ టెస్టులు నిర్వహిస్తారని అధికారులు చెబుతున్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్, జిరాక్స్ సెట్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

ఏలూరు రేంజ్ డిఐజి అశోకుమార్ స్వయంగా ఎంపిక ప్రక్రియను పరిశీలిస్తున్నారు. వర్షాలు కురిసినా అభ్యర్థులకు అసౌకర్యం లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టామని ఆయన చెప్పారు. డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు ఈ పరీక్షలు సజావుగా సాగేలా చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. పారదర్శకంగా ఎంపిక పరీక్షలు చేపట్టాలన్నారు.

వినతిని అందిస్తున్న అంగన్‌వాడీలు

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - నిడమర్రు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు క్యాంపు కార్యాలయంలో పిఎ రవికి వినతిని అందించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు జి.విజయలక్ష్మి మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల సమయంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఇస్తున్న వేతనాల కంటే అదనంగా ఇస్తానని చెప్పారని కానీ అమలు చేయ లేదన్నారు. ఫొటో సిస్టం రద్దు చేయాలని, అంగన్‌వాడీ సెంటర్లకు ట్యాబులు ఇవ్వాలని కోరారు. పని ఒత్తిడితో మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారని, పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు, యూనియన్ నాయకులు జాలాది సునీత, టి.వెంకటరమణ, షేక్ రసూల్, సిహెచ్.కుమారి, రాధిక, పివి.విల్సన్, అరుణ, సత్యవతి పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ నటుడుగా అల్లు అర్జున్ ఎంపిక పట్ల హర్షం

ప్రజాశక్తి - ఏలూరు

జాతీయ ఉత్తమ నటుడుగా అల్లు అర్జున్ ఎంపిక పట్ల కేంద్ర ప్రభుత్వ పారిశ్రామిక మండలి మాజీ సభ్యులు పులి శ్రీరాములు హర్షం వ్యక్తం చేశారు. తెలుగు సినీరంగానికి ఇప్పటివరకూ అందని అవార్డు అందుకున్న అల్లు అర్జున్‌ని ఆయన అభినందించారు. ఇటీవల కాలంలో తెలుగు చలన చిత్ర పరిశ్రమకు అంతర్జాతీయ ఖ్యాతి రావటం ఆనందంగా ఉందని ఆయన అన్నారు.

## వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

**ఏలూరు:** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఉపరవాణా కమిషనరు ఎస్.శాంతకుమారి సూచించారు. గురువారం ఏలూరులోని స్థానిక అగ్నిమాపక కార్యాలయం వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడుతూ హెల్మెట్ లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తలకు గాయాలై ప్రాణాలు కోల్పోతున్నారని, హెల్మెట్ ఉంటే విలువైన ప్రాణాలను దక్కించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమమంలో ప్రాంతీయ రవాణా అధికారి కె.శ్రీహరి, మోటారు వాహనాల తనిఖీ అధికారులు కె.విజయరాజు, జి.ప్రసాదరావు, ప్రసాద్, వై.సురేష్‌బాబు, పోలీస్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డిఎస్‌పి ధనుంజయుడుకు అభినందిస్తున్న మహిళలు

## డిఎస్‌పికి మహిళల అభినందన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక డిఎస్‌పి ఎ.ధనుంజయుడుకు పట్టణానికి చెందిన పలువురు మహిళలు ప్రశంసలు తెలిపారు. గురువారం డిఎస్‌పి కార్యాలయంలో డిఎస్‌పి ధనుంజయుడును గురువారం పలువురు మహిళలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. డిఎస్‌పి ధనుంజయుడు జీవిత కేంద్ర హోంమంత్రి పరిశోధన ప్రతిభా పురస్కారం అందుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. జీవితం పట్టణంలో బహిరంగంగా మద్యపానం సేవించేవారిపై, గంజాయి నివారణపై దృష్టి సారించడంతో పాటు మహిళా రక్షణకు కృషి చేస్తున్న డిఎస్‌పి ధనుంజయుడికి మహిళలు మొక్కలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ అధ్యక్షురాలు అన్నపూర్ణాదేవి, వైసిపి పట్టణ మహిళా అధ్యక్షురాలు నాగదేవి, మానవత జిల్లా కన్వీనర్ త్రిపుర రమేష్, మెప్మా ఆర్‌పి నాగలక్ష్మి, పేమలత పాల్గొన్నారు.

## డాక్టర్ ప్రసాద్‌కు పితృవియోగం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు దండమూడి ప్రసాద్‌కి పితృ వియోగం కలిగింది. ప్రసాద్ తండ్రి దండమూడి వెంకట్రావు అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు. పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, వైద్య ప్రముఖులు వెంకట్రావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ ప్రసాద్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


వెంకట్రావు (ఫైల్‌ఫోటో)

## రోడ్లు నిర్మించాలని నేడు ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరులో అస్తవ్యస్తంగా తయారైన రోడ్లను నిర్మించాలని, చిన్నపాటి వర్షానికే రోడ్లు నీటితో నిండిపోయి ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతున్న పరిస్థితి నుంచి ప్రజలను కాపాడాలని, పైపులైన్ పేరుతో తవ్వేసిన రోడ్లను వెంటనే నిర్మించాలని కోరుతూ ఈ నెల 25వ తేదీన శుక్రవారం ఏలూరులో ర్యాలీ, ధర్నా చేపడుతున్నట్లు సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఇఫ్టూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలూరులో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఏలూరు ఎంఎల్‌ఎ రోడ్ల దుస్థితి గురించి పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం మేలుకొని రోడ్లను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏలూరు రోడ్ల దుస్థితి పట్ల నిరసన వ్యక్తం చేస్తూ శుక్రవారం ఉదయం 11 గంటలకు వైఎంహెచ్ఎ హాలు సెంటర్ నుంచి ర్యాలీ బయలుదేరి మెయిన్ బజార్ మీదుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని అక్కడ ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

## విద్యార్థులకు ఉచిత బస్సుపాసులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరం జిల్లా పరిషత్ హైస్కూలులో పేద విద్యార్థులు 155 మందికి ఎపిఎస్ ఆర్‌టిసి తాడేపల్లిగూడెం డిపో అధికారులు ఉచిత బస్సు పాసులను దాతల సహకారంతో గురువారం అందించారు. ఈ ఉచిత బస్సుపాసులకు అయిన ఖర్చును కైకరానికి చెందిన సామాజిక సేవా సంస్థ పెద్దిరెడ్డి వేణుగోపాల కృష్ణ ప్రసాదరావు, శేషవేణి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముత్తంగి వేణుగోపాల్ ఆర్‌టిసి వారికి అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉభయగోదావరి జిల్లాల ట్రాన్స్ కో విజిలెన్స్ ఆఫీసర్ వి.రవికుమార్ హాజరయ్యారు. బస్సుపాసుల పంపిణీ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ప్రధానోపాధ్యాయులు జి.ప్రసాదరావు వహించారు. అనంతరం బస్సుపాసుల దాత ముత్తంగి వేణుగోపాల్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ ఆర్‌టిసి తాడేపల్లిగూడెం పిఆర్‌ఒ దొంతల విజయ్‌కుమార్, మానవత మండల అధ్యక్షులు జి.రవికుమార్, సహాయ కార్యదర్శి కోనే సత్యనారాయణ, మానవత సంస్థ చైర్మన్ గుణ్ణం బుల్లబ్బాయి, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, కైకరం గ్రామ ఉపసర్పంచి మట్టా మురళి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, పాఠశాల విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు కన్నారావు పాల్గొన్నారు.

## ప్రగడపల్లిలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని ప్రగడపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు తోడుగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, ఎంపిడిఒ జి.శ్రీను, జెడ్‌పిటిసి సభ్యులు కలుమ్ హేమకుమారి, సర్పంచి కలుమ్ బాపిరాజు, ఎంపిటిసి సభ్యులు దాపర్తి మోహన్‌రావు, వైసిపి మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ, ఎస్ఐ ఎస్.ఎస్.పవన్‌కుమార్, వార్డు మెంబర్లు, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 8,9 తేదీల్లో ఎఐసిటియు జాతీయ మహాసభ

ప్రజాశక్తి - ముసునూరు

వచ్చే నెల 8,9 తేదీల్లో బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగే ఎఐసిటియు జాతీయ మహాసభ జయప్రదం చేయాలని రాష్ట్ర కమిటీ సభ్యులు వేముల బక్కయ్య పిలుపునిచ్చారు. మండలంలోని చెక్కపల్లి గ్రామంలో ఎఐసిటియు అనుబంధ మిడ్‌డే మీల్ వర్కర్స్ - శానిటేషన్ వర్కర్స్ యూనియన్ సంయుక్త సమావేశం ఆరెల్లి సరోజిని, నందిపాము భారతి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐసిటియు రాష్ట్ర కమిటీ సభ్యులు వేముల బక్కయ్య మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తోట వాణి, వల్లూరి లోటిలక్ష్మి, ఆరెల్లి సరోజిని, పల్లెపాము భవాని, పల్లెపాము విజయ, ఆతుకూరి అరుణ, గడ్డం అమృత, నందిపాము భారతి, ఆముదాల స్వప్న, కుమారి, నందిపాము హేమలత, చందమాల శిరోమణి, నందిపాము కల్యాణి, దాసరి శాంతకుమారి పాల్గొన్నారు.

## సబ్ ట్రెజరీ కార్యాలయానికి అద్దె భవనం అవసరం

భీమడోలు :భీమడోలు సబ్ ట్రెజరీ కార్యాలయానికి అద్దె ప్రాతిపదికన భవనం అవసరమైందని ఉప ఖజానాధికారి ఎస్.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు భవనం భీమడోలులో, పరిసర ప్రాంతాల్లో ఉంటే తమను సంప్రదించాలని తెలిపారు.

### నేరాలు - ఘోరాలు

## వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - మండవల్లి

చేపల చెరువుపై కాపలాదారుడుగా పనిచేస్తున్న వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన లోకుమూడిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కైకలూరు మండలంలోని శ్యామలాంబపురం గ్రామానికి చెందిన బస్సు నరేష్(30) లోకుమూడి గ్రామానికి చెందిన గుత్తికొండ రాధాకృష్ణకు చెందిన చేపల చెరువుపై కాపలాదారుడిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో చెరువుగట్టుపైనే గుత్తికొండ రాధాకృష్ణ కార్యాలయం ఉండడంతో సుమారు 8:30 గంటల సమయంలో చెరువు దగ్గరకు రాగా నరేష్ అక్కడ కనిపించలేదు. అతని కోసం వెతకగా చెరువు గట్టుపై ఉన్న రేకుల షెడ్డు దూలానికి ఉరేసుకుని వేలాడుతుండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# రైతుల ఆదాయం పెరిగేలా చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో రైతుల ఆదాయం పెంపొందించే దిశగా విస్తృతంగా ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లను (ఎఫ్‌పిఒ) ఏర్పాటు చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ఉత్పత్తి, మార్కెటింగ్‌లో స్కేల్ ఆఫ్ స్కేల్‌ను ఉపయోగించడం ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యాన్ని సాధించడంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పిఒలు) కీలకమన్నారు. దీర్ఘకాలికంగా ఆదాయ-ఆధారిత వ్యవసాయానికి ఎఫ్‌పిఒలు భరోసానిస్తాయన్నారు. ఇది వ్యవసాయ ఉత్పత్తిఖర్చును తగ్గించడం ద్వారా రైతులకు ఎక్కువ డబ్బు సంపాదించడానికి ఉప యోగ పడుతుందన్నారు. జిల్లాలో ఉన్న అన్ని ఉద్యాన పంటలకు అధికలాభాలు అందించేలా తోడ్పడటానికి ఉద్యాన శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. ఎఫ్‌పిఒ గ్రూపులకు ఎఐఎఫ్ పథకంలో కలెక్షన్ సెంటర్, కోల్డ్ రూమ్ కింద 75 శాతం సబ్సిడీ ఇస్తారన్నారు. అలాగే పిఎఫ్ఎంఎఫ్‌ఇ పథకంలో 35 శాతం సబ్సిడీతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చని రూ.10 లక్షలు ఒక యూనిట్‌కు ఇస్తామని వివరించారు. రైతులకు డైరెక్ట్ ప్రొడ్యూస్ మార్కెటింగ్ కంటే ప్రాసెస్డ్ ఫుడ్స్ ద్వారా లాభదాయకమని, వారివార్షిక ఆదాయం ఎక్కువగా పెరుగుతుందని వివరించారు. ఈ సమావేశంలో సిడిబి డిప్యూటీ డైరెక్టర్ ఎస్.కుమార్, ఎపిఎఫ్ పిఎస్ జోనల్ మేనేజరు కెజె మారుతీ, ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.రామ్మోహన్, నాబార్డ్ డిడిఎం నవకాంత్, పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

# 26, 27 తేదీల్లో చేతివృత్తిదారుల జిల్లా శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా శిక్షణ తరగతులు ఈ నెల 26, 27 తేదీల్లో ఏలూరు కెనాల్ రోడ్డులో ఉన్న యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు తెలిపారు. స్థానిక ఆర్ఆర్.పేటలోని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎంపికైన 200 మంది వృత్తి సంఘాల నాయకులకు, కార్యకర్తలకు రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆదిశేషు తెలిపారు. ఈ నెల 26వ తేదీన సమాజ పరిణామం ప్రపంచీకరణ నేపథ్యంలో చేతివృత్తుల పరిస్థితులు అంశంపై సదస్సు, 27వ తేదీన ప్రభుత్వ విధానాలు సంఘ నిర్మాణంపై శిక్షణా తరగతి నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న వృత్తిదారుల వ్యతిరేక విధానాలపై ఆందోళన పోరాటాలకు సన్నద్ధం చేయనున్నట్లు చెప్పారు. నేడు ప్రపంచీకరణ నేపథ్యంలో కొన్ని వృత్తులు దెబ్బతింటున్నాయని, మరికొన్ని వృత్తులు కనుమరుగవుతున్నాయని, వృత్తిదారులు ఉపాధి లేక వీధిన పడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వృత్తుల రక్షణ, వృత్తిదారుల సంక్షేమం, సామాజిక భద్రతకు చేతివృత్తిదారులకు ఉప ప్రణాళికను ఏర్పాటు చేయాలని, జనాభా ప్రాతిపదికన విధులు కేటాయించి ఖర్చు చేయాలని కోరారు. ఉచ్చుదారులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని, 50 ఏళ్లు దాటిన ప్రతి చేతి వృత్తిదారునికి సామాజిక పింఛన్ రూ.మూడు వేల చొప్పున ఇవ్వాలని, వృత్తులు కోల్పోయిన ఉచ్చుదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరారు. చేతి వృత్తిదారులకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.50 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు వేల కోట్లు కేటాయించి వృత్తిదారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. శిక్షణా తరగతులకు చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఓలేటి శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో రజక వృత్తి దారుల సంఘం జిల్లా కన్వీనర్ పత్తిపాటి రామకృష్ణ, శౌర వృత్తి దారుల సంఘం నగర నాయకులు చంద్రరావు, ఉప్పర సగర సంఘం రాష్ట్ర నాయకులు తాడిశెట్టి కాటమరాజు పాల్గొన్నారు.

## 'స్పందన' అర్జీలను త్వరగా పరిష్కరించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

స్పందన అర్జీలను త్వరితగతిని పరిష్కరించాలని ఇఒపిఆర్‌డి శ్రీహరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలో ఇప్పటివరకు వచ్చిన స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో, సచివాలయ గ్రేడ్-5 కార్యదర్శులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి శ్రీహరి మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందేలా వారి సమస్యను పరిష్కరించాలన్నారు. అర్జీలను పరిష్కరించడంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి గ్రామపంచాయతీ కార్యదర్శులకు వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో మండలంలోని 21 పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శిలు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీల అభివృద్ధికి పటిష్ట కార్యాచరణ : ఆళ్ల నాని

ఏలూరు టౌన్ : జగనన్న కాలనీల అభివృద్ధికి పటిష్ట కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌ఎ ఆళ్ల నాని తెలిపారు. కొమడవోలు జగనన్న నగర్‌లో నూతనంగా నిర్మించిన 33/11 కిలోవాట్ల సామర్థ్యం గల విద్యుత్ ఉప కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేదవారి సొంతింటి కలను సాకారం చేసేలా అర్హులైన వారందరికీ ఇంటి స్థలంతో పాటు, ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షలను పూర్తి ఉచితంగా మంజూరు చేశామన్నారు. ఏలూరు నియోజకవర్గ పరిధిలోనే సుమారు 30 వేల మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశామని, ఆయా కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణంతో పాటు మంచినీటి సౌకర్యం, విద్యుదీకరణ, రహదారులు, డ్రెయినేజీల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేస్తున్నామన్నారు. జగనన్న కాలనీల్లో అత్యున్నత జీవన ప్రమాణాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్ సుధీర్‌బాబు, కమిషనర్ వెంకటకృష్ణ, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

చంద్రయాన్-3 విజయవంతంపై వికాస్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్ విద్యాసంస్థల అధినేత వి.జగన్ మాట్లాడుతూ చంద్రయాన్-3 ప్రపంచవ్యాప్తంగా భారతీయులు సాధించిన ఓ గొప్ప విజయమన్నారు. చంద్రయాన్, గగన్యాన్ వంటి ప్రయోగాలు మరిన్ని విజయవంతం కావాలని ఆయన ఆశ భావం వ్యక్తం చేశారు. మానవాళికి ఉపయోగపడే మరిన్ని ప్రయోగాలు ఇస్రో చేపట్టాలన్నారు. ఈ ర్యాలీ స్థానిక వికాస్ జోన్ నుంచి కాలేజీ రోడ్డు హైస్కూల్ మీదుగా మసి సెంటర్ బస్టాండ్ సూర్య కాలేజీ, నారాయణ స్కూల్ మీదుగా సాగింది. ఈ ర్యాలీలో వికాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ వి.సౌజన్యలక్ష్మి, డీన్ కొప్పుల సత్యనారాయణ, ఎఒ మోహన్, ఎజిఎం సురేష్, బ్రహ్మేష్, రాంబాబు, ప్రిన్సిపల్ హేమంత్, సీనియర్ లెక్చరర్లు చిట్టిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలిదిండి : చంద్రయాన్-3 విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక కలిదిండి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించి, ప్రధాన సెంటర్‌లో మానవహారం చేపట్టారు. శశి హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కరెస్పాండెంట్ ఎస్‌వి.రామారావు, సర్పంచి సానామీనా సరస్వతి, శశి స్కూల్ కరస్పాండెంట్ జివి.సత్యనారాయణరాజు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం వికాస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ర్యాలీ

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్న ఫణీంద్రబాబు

ప్రజాశక్తి - టి.నరసాపురం

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఆర్.ఫణింద్ర సూచించారు. మండల వైద్యాధికారి జె.కల్పనారాణి ఆదేశాల మేరకు ఫణీంద్రబాబు మండలంలోని రుద్రకోటరాజుగూడెంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. మెడికల్ క్యాంపు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే - ఫ్రైడే పాటించాలని, కాచిచల్లార్చిన నీటిని తాగాలని, నీరు నిల్వ ఉండే ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీటితొట్టెలు, ప్లాస్టిక్ డ్రమ్ములతో పాటు నీరు నిల్వ ఉండే ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రజలు డెంగీ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి, జ్వరం వచ్చిన వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వెంకటలక్ష్మి, లలిత పాల్గొన్నారు.

# సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామపంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారిన నేపథ్యంలో రోడ్డుపై సెంట్రల్ ఎలక్ట్రికల్ దీపాలు ఏర్పాటు చేయాలని భీమడోలు గ్రామ సర్పంచి పి.సునీతమాన్సింగ్ ఆధ్వర్యంలోని పంచాయతీ పాలకవర్గం విజ్ఞప్తి చేస్తుంది. ఈ మేరకు పంచాయతీ పాలకమండలి సభ్యులు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను కలిసి ఆయన వద్ద సిఫార్సు పత్రాన్ని తీసుకుని జాతీయ రహదారుల శాఖ, రాజమండ్రి ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌ను గురువారం కలిశారు. భీమడోలు పంచాయతీ పాలకమండలి సభ్యులు విజయ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలోని రెండు ప్రాంతాలను రవాణా, పోలీస్ శాఖవారు ప్రమాదాలకు అనువైన వాతావరణం గల బ్లాక్ స్పాట్లుగా గుర్తించారన్నారు. దీనిలో కనక దుర్గాదేవి ఆలయం వద్ద ఉన్న రోడ్డు విభాజకం ప్రాంతంలో రాకపోకలకు అనువుగా ఏర్పాటు చేసిన మార్గం ఒకటన్నారు. దీని ద్వారా ప్రయాణించేందుకు భీమడోలు నుంచి ఏలూరు వెళ్లే వాహనదారులు కొద్ది దూరం తాడేపల్లిగూడెం వైపు వెళ్లే రహదారిపై ప్రయాణించి ఆ ప్రాంతం వద్ద ఏలూరు వైపు వెళ్లే రహదారిపైకి వచ్చి ప్రయాణాన్ని కొనసాగించాల్సి ఉంటుందన్నారు. ఇదే విధంగా భీమడోలు గొలుసుల గేటు సమీపంలో ఉన్న రోడ్డు విభాజకం వద్ద ఏర్పాటుచేసిన మార్గం ద్వారా తాడేపల్లిగూడెం వైపు నుంచి భీమడోలుకు వచ్చే వాహనదారులు ఆ ప్రాంతం ద్వారా తిరిగి ఏలూరు వైపు జాతీయ రహదారిపై వచ్చి ఆ తర్వాత భీమడోలు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. కాని ఈ రెండు ప్రాంతాల ద్వారా ప్రయాణం చేసే పలువురు వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలకు విరుద్ధంగా ఆ ప్రాంతాల్లో అనధికారికంగా రోడ్డు దాటి రెండో వైపునకు వచ్చే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ప్రఖ్యాత పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమలకు భీమడోలు మీదుగా వచ్చే, వెళ్లే వాహనదారులు ఆ రెండు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన నిర్ణీత మార్గాల ద్వారా మాత్రమే రోడ్డును దాటాల్సి ఉండగా తమకు అనువైన ప్రాంతాల్లో రోడ్డు దాటడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఇవి ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయన్నారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని జాతీయ రహదారుల శాఖ వారు ఆ ప్రాంతాలకు దిగువన గల అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద నుంచి గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న కంచి కామాక్షి కాలనీ వరకు సెంట్రల్ విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, రేడియం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన జాతీయ రహదారుల రాజమండ్రి ప్రాజెక్ట్ డైరెక్టర్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

భీమడోలు వంతెన వద్ద ఉన్న జాతీయ రహదారికి రెండు వైపులా రోడ్డు

# ప్రభుత్వ భవనాలు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీల భవనాలు సెప్టెంబర్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని సిఎం జగన్ ఆదేశించారని ఎంపిపి మోహిని భర్త వైసిపి మండల యువనేత బొండాల వెంకన్నబాబు తెలిపారు. మండలంలోని గుండుగోలుగుంట, రాళ్లగుంట, తిమ్మాపురం గ్రామాల్లో నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ భవనాలను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన ఎంపిపి కార్యాలయంలో ద్వారకాతిరుమల పంచాయతీరాజ్ శాఖ డివిజనల్ ఇంజినీరింగ్, మండల ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు. ఈ భవనాల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. మండలంలో ప్రస్తుతం భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వీటిని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గృహ నిర్మాణ సంస్థ అధికారులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేసి లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒటిఎస్ పెండింగ్‌లో ఉన్నవాటిని కూడా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. త్వరలోనే మండల వ్యాప్తంగా పూర్తయిన నూతన భవనాలను ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లి జిల్లాలోని మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి పెద్దఎత్తున ప్రారంభోత్సవాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, నిర్మాణ దశలో ఉన్న పనులు, ఇంకా ప్రారంభించాల్సిన పనుల గురించి చర్చించారు. ప్రభుత్వ భవనాలు నిర్మాణ దశలో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులను ప్రజాప్రతినిధులు వివరించారు. అభివృద్ధి పనుల్లో మండలం ముందుండేలా కృషి చేయాలన్నారు. సచివాలయ వ్యవస్థ, జిల్లాల పునర్విభజన వల్ల పాలన ప్రజలకు చేరువైందని, ప్రజాప్రతినిధులు అధికారులు కలిసి సమిష్టిగా కృషి చేసి భవన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, భవన నిర్మాణాలకు జగనన్న కాలనీల ఇళ్లకు ప్రభుత్వం బిల్లులు వెంటనే మంజూరు చేస్తుందని తెలిపారు. వెంకన్నబాబుతో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సహకార సంఘాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వెంకన్నబాబు, అధికారులు

## రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - కలిదిండి

అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో సిపిఎం కైకలూరు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. మండలంలో ప్రధానంగా గుర్వాయిపాలెం నుంచి పెదలంక రహదారి గోతులమయంగా మారి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయన్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ నాలుగో తేదీ వరకు నిరుద్యోగం, అధిక విద్యుత్ ఛార్జీలకు నిరసనగా దేశవ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అదే సమయంలో స్థానిక సమస్యలపై గ్రామ సచివాలయాల వద్ద, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కలిదిండి, కైకలూరు మండలాల సిపిఎం కార్యదర్శులు శేషపు మహం కాళిరావు, కురేళ్ల లాజరు, కార్యకర్తలు వీరవల్లి భాస్కరరావు, చిన్నం మాధవ, అద్దాని వెంకటేశ్వరరావు, పాతపాటి జ్ఞానేష, పరసా రాజేష్, పి.సత్యనారాయణ, చిన్నం శ్రీకాంత్, జక్కుల మహేష్, గద్దె అనిల్‌కుమార్, బి.సురేష్ పాల్గొన్నారు.

## సిఎస్‌టిఎస్ కళాశాలలో సాహిత్య సదస్సు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తెలుగు భాష సాహిత్యంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కేంద్రీయ విశ్వవిద్యాలయం, తెలుగు శాఖ ఆచార్యులు పరిమి రామ నరసింహం సూచించారు. స్థానిక సిఎస్‌టిఎస్ ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన గురువారం సాహిత్య సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేంద్రీయ విశ్వవిద్యాలయం, తెలుగు శాఖ ఆచార్యులు పరిమి రామ నరసింహం పాల్గొని మాట్లాడారు. భాష భావ వ్యక్తీకరణ అంశంపై పూర్వ భాష శాస్త్రవేత్తలు చేసిన కృషిని కొనియాడారు. గిడుగు రామ్మూర్తి తెలుగు వ్యవహారిక భాషకు చేసిన సేవ గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సదస్సులో తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ జి.వెంకటలాల్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్య పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రజారోగ్య పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌ఎ ఆళ్ల నాని అన్నారు. స్థానిక 15వ డివిజన్‌లో రూ.81.74 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యుత్తమ వైద్య సేవలను అందిస్తున్నామని, ఈ మేరకు అన్ని ప్రభుత్వాసుపత్రుల్లోనూ అధునాతన సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్య కేంద్రాల్లో రోగ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు వీలుగా వైద్య పరికరాలను అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

IN THE HONOURABLE COURT OF VI ADDITIONAL SENIOR CIVIL JUDGE, VISAKHAPATNAM
O.S. 39 of 2022
Between:-
1) Edru Nagendra Prasad
2) Edru Lakshmi Ratna Padma Kumari ...Plaintiffs
And:-
Senam Suman ...Defendant
To,
Senam Suman, S/o Atchyuta Chandra Sekhar @ Babu, R/o Door No: 5-4-1, Garapativari Street, Pathuru, Tanuku, West Godavari District.
Please take notice that the above suit is posted on **11-09-2023** for your notice by way of substituted service of summons as ordered by the Honourable Court. Therefore, you are informed by means of this notice that you have to appear in the above matter before the Honorable Court **at 10.30 A.M.** either in person or through an Advocate to answer the claims in the above Suit, failing which the claim in the suit will be decided in your absence.
Sd/- KHASPA KRISHNA MOHAN
KHASPA SAGAR
Advocate for Plaintiffs
Visakhapatnam
Dt:25-08-2023

పేరు మార్పు ప్రకటన
**గెద్దం సువర్ణ రాజు** (కొత్త పేరు), తండ్రి గెద్దం వెంకటేశ్వరరావు, గతంలో నా పేరు **గెద్దం సువరణ రాజు** (పాత పేరు), తండ్రి: గెద్దం వెంకటేశ్వరరావు, డోర్ నెం. 4-26, హరిజన పేట, పెనుమంట్ర గ్రామం, పెనుమంట్ర మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు నివసించుచున్నాను. ఇప్పుడు నా పేరును **గెద్దం సువరణ రాజు** (పాత పేరు), తండ్రి: గెద్దం వెంకటేశ్వరరావు నుండి **గెద్దం సువర్ణ రాజు** (కొత్త పేరు) తండ్రి: గెద్దం వెంకటేశ్వరరావు గా మార్చుకున్నాను. ఈ రోజు నుండి తదుపరి అన్ని లావాదేవీల కోసం నా కొత్త పేరును ఉపయోగించవలెను.
సెల్: 9182899030

పాస్‌పోర్టు పోయినది
కట్టా శ్రీను, తండ్రి: తాతారావు అను నేను కట్టావారిపాలెం నడిపూడి గ్రామ కాపురస్తులైన నా యొక్క **E.C. Passport No. X548261** గల పాస్‌పోర్టు పడిపోయినది. నడిపూడి నుండి పెనుగొండ వెళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు పోయినది. ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.
అడ్రస్:
కట్టా శ్రీను, తండ్రి: తాతారావు
డోర్ నెం. 6-7/1, నడిపూడి
పెనుగొండ మండలం, ప॥గో॥జిల్లా
పిన్: 534320
సెల్: 9849662420